# విద్యా వివాహా నాశాయ..?




ద్విభాష్యం రాజేశ్వరరావు

'శ్రీనాధుడు వ్రాసిన గ్రంధాలేమిటి ?'

మెల్లగా సణుగుతున్నట్లు అడుగుతోంది, వెనుక సీటులోని అమ్మాయి. అప్పుడే నాలుగోసారి ఈ ప్రశ్న అడగటం !

తలెత్తి మెల్లగా చుట్టూ కలయ చూశాను. వాళ్లు ఇద్దరూ హాలుబయట నిలబడి మాట్లాడుకుంటున్నారు. నేను సమాధానం వ్రాసిన పేజీ పక్కగాపెట్టి చూసుకొని వ్రాయమన్నట్లుగా సంజ్ఞ చేశాను. వెనుకనున్న అమ్మాయి నేను వ్రాసిన సమాధానం కాపీచేయటం ఆరంభించింది.

నేను చేస్తున్న పని తప్పని నాకు తెలుసు. కాని ఆమెకు ఎలా చెప్పటం ?

నేను రాస్తున్నవి బియ్యే మొదటి సంవత్సరం పరీక్షలు. నా ఉద్యోగానికీ, చదువుకీ సంబంధం లేకపోయినా సాహిత్యంమీద వుండే సరదాకొద్దీ బియ్యే చదవటం ఆరంభించేను. ఇంజనీరింగ్ పరీక్షలు వ్రాసి ఎనిమిదేళ్లు సర్వీసు పూర్తిచేశాక మళ్ళీ ఈ పరీక్షలు వ్రాయటం! సమాధానాలు తెలిసినవే అయినా తెలుగు వ్రాయటం అలవాటు

తగ్గి, వేగంగా వ్రాయలేకపోతున్నాను. దానికితోడు వెనుక సీటులోని అమ్మాయి సణుగుడు మరీ ఇబ్బందిగా తయారయింది.

హాలు బయటకు వచ్చాక 'రేపటి నుండి ఈ ధోరణి మానుకొమ్మ'ని సలహా ఇవ్వాలనుకున్నాను.

ఆఖరి 'బెల్' అయిపోయింది.

వాచర్లు సమాధానం వ్రాసిన కాగితాలు తీసుకున్నారు.

హాలు బయటకువచ్చి వరండా మెట్లు దిగేను.

నా వెనుక సీటులోని ఆ మ్మాయి చిరునవ్వుతో నా దగ్గరకువచ్చి "థేంక్యూ! మీరు ఆ సమాధానం చూపించకపోతే అనవసరంగా పదిహేను మార్కుల ప్రశ్న వదులుకోవలసి వచ్చేది" అంది. ఒక నిమిషంపాటు సమాధానం ఇవ్వకుండా ఆమెవంకే చూస్తూ వుండి పోయాను. నేను చెప్పాలనుకున్న సలహా నా నాలిక క్రిందే వుండిపోయింది.

తర్వాత మెల్లగా "ఫర్వాలేదులెండి!" అన్నాను.

"మీరూ ప్రయివేటుగానే చదివేరా?" అడిగింది. అవునన్నట్లు తలవూపేను.

"ఈ వూళ్ళో ఏం చేస్తున్నారు?"


"ఫెర్టిలైజర్ ప్లాంటులో పని చేస్తున్నాను! ఈ చదువంటారా? తోచక! తెలుగు సాహిత్యం మీది మమకారంకొద్దీ! అంతే!" అన్నాను.

"మిమ్మల్ని చూసి కాలేజీ స్టూడెంటనే అనుకున్నాను. ఉద్యోగస్తులనుకోలేదు!"

"థేంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్" అన్నాను నవ్వుతూ.

"థేంక్స్ ఎందుకు? ఉద్యోగంచేస్తూ కూడా స్టూడెంట్లుగానే పిలిపించుకోవటం మీకు ఇష్టమన్నమాట" అంది.

"పోయిన రోజులు తిరిగిరావు కదా! అందుకే అది కాంప్లిమెంట్ క్రింద తీసుకున్నాను."




"రేపు కూడా మీరు నాకు సహాయం చేయాలి" అందిమెల్లగా. "తప్పకుండా!" అన్నాను.

"వెళ్ళొస్తానండి. నా పేరు కృష్ణ సుందరి, మీ పేరు కృష్ణమూర్తి అని తెలుసు. బై!" అంటూ వెళ్ళిపోయింది.

ఆమెకు నా పేరు ఎలా తెలిసిందో ఊహించటం ఏమంత కష్టమయిన విషయంకాదు. నా సీటుమీద నా నెంబరు ప్రక్కన పేరు కూడా అతికించేరు. అది ఆమె చూసివుండాలి. కాలేజీ గేటుదాటి వెళ్ళేవరకూ, ఆమెవంకే చూస్తూ నిలబడ్డాను. తరువాత 'కారిడార్'లోకి వచ్చి స్కూటర్ స్టార్టుచేశాను.

పరీక్షలు జరిగిన అయిదురోజుల్లోనూ కృష్ణసుందరితో నా పరిచయం బాగా పెరిగింది. పరీక్షకు ఇంకా గంట టయిముందనగానే ఆమె కాలేజీకి వచ్చేది. పరీక్షలోని ప్రశ్నల గురించి చర్చించుకోటంతోబాటు స్వంత విషయాలు కూడా మా మధ్య దొర్లేవి.

కృష్ణసుందరి సన్నగా నాజూగ్గా వుంటుంది. నల్లని నిడువైన కురుల్ని అందంగా రెండు పాయలుచేసి రెండు జడలూ వేసుకుంటుంది. యవ్వనానికి కాపలా వేసుకుంటున్నట్లు అందులో ఒక జడను వెనక్కి మరో జడను ముందుకి పడేసుకుంటుంది.

"ఇంటరు పాసై హాయిగా ఇంట్లో కూర్చుంటే, నాకు మళ్ళీ ఈచదువుపోరు ప్రారంభమయింది లేకపోతే ఇరవై యేళ్ళు వచ్చేక ఈ బియ్యే చదువేమిటి?" అంది రెండోరోజు పరీక్షరాసి బయటకు వచ్చేక.

"చదువుకి వయస్సేమిటి? నలభై యేళ్ల వాళ్లు వచ్చి పరీక్షలు రాస్తున్నారు. ఆ మాటకివస్తే నాకు ముప్ఫయి సంవత్సరాలు లేవూ!" అన్నాను.

కృష్ణసుందరి చూడటానికి ఇరవై యేళ్ళ అమ్మాయిలా కనుపించదు. ఇంగ్లీషు, తెలుగు కూడా చక్కని పలుకుబడితో మాట్లాడుతుంది. ఆమె కున్న వయసుకు, హెచ్చు విజ్ఞానం ఆర్జించినట్లే వుంటాయి ఆమె మాటలు.

"చదువుకి వయసుతో సంబంధం లేకపోవచ్చు. కాని ఈ డిగ్రీలు మాత్రం కొలతబద్దలు కావు" అంది.

"అది నిజమే!" అన్నాను ఏమనాలో తోచక.

"మా బావ ఈ సంగతి ఒప్పుకోడు, ఏం చేయటం?" అంటూ గొణుక్కుంది. ఆ బావ ఎవరో, అతడు ఒప్పుకోని

సంగతులేమిటో నేను వివరంగా అడగ లేదు.

ఆఖరు పరీక్ష అయిపోయాక "కేంటీనులో కాఫీ తాగుదామా ?" అన్నాను.

ఆమె అంగీకారంగా తలవూపింది.

కాఫీ తాగుతూ ఆ వేళ పేపరులోని సమాధానాల గురించి చర్చించుకున్నాం. తరువాత కృష్ణసుందరి అడిగింది "మీకు పెళ్ళయిందా ?" "ఆహా ! లక్షణంగా ! ముగ్గురు పిల్లలు !" అన్నాను.

"మీ భార్య అదృష్టవంతురాలు !" అంది.

"నా భార్య అదృష్టం గురించి మాట్లాడుతున్నారు. నా గురించి మీ కేం తెలుసు ?".

"మిమ్మల్ని బట్టి మీ భార్య అదృష్టం ఊహించటంలేదు. ఈ దేశంలో పెళ్ళయిన ప్రతి ఆడదీ అదృష్టవంతు రాలే !".

"ఆడదానికి పెళ్ళి అంత సమస్యగా తయారయిందంటారా ?"

"నా విషయంలో మట్టుకు అంతే ! మా బావకు నన్ను ఇచ్చి చేయాలని చిన్నప్పటినుంచీ అనుకుంటున్నారు కాని నేను డిగ్రీ పాసయితే కాని మా బావ నన్ను చేసుకోనన్నాడు. నాకీ చదువుమీద ఇష్టంలేదు. క్లాసు పుస్తకాలు తప్ప ఏ పుస్తకాలయినా చదవటం నా కిష్టమే ! 'ఇర్వింగ్ వేలస్' నుండి 'ఛేజ్' వరకూ అన్ని పుస్తకాలూ చదువుతాను. రోజూ 'హిందూ' పేపరు పూర్తిచేయకుండా నిద్రపోను. అయినా మా బావకి నా డిగ్రీయే ప్రధానమట ! 'భార్య ఏం చదివింది?' అని ఎవరయినా అడిగితే కనీసం 'డిగ్రీ పాసయినట్లు చెప్పకపోతే ఎలా?' అంటాడు. అందుకే ఇష్టంలేకపోయినా ముక్కుకు తాడుకట్టుకొని చదువుతున్నాను" అంది. కాఫీలు ముగించి బయటకు వచ్చేం.

"వీలు కలిగినపుడు మా ఇంటికి రండి. మా శ్రీమతిని పరిచయం చేస్తాను" అంటూ నా చిరునామా రాసి ఇచ్చేను.

"అలాగే" అంటూ వెళ్ళిపోయింది.

అంతే !! ఆ తరువాత మళ్ళీ రెండు సంవత్సరాలు నేను కృష్ణసుందరిని చూడలేదు. రెండో సంవత్సరం పరీక్షలు వ్రాయటానికి ఆమె రాలేదు. చదువు ఆపేసి పెళ్ళిచేసుకుందేమోననుకున్నాను. మూడో సంవత్సరం పరీక్షలు వ్రాయ టానికి కాలేజీకి వెళ్ళినపుడు ఆమె కనుపించింది. నేను గుర్తుపట్టలేక పోయాను ఆమెను. "బాగున్నారా ?" అంటూ నవ్వుతూ ఆమే నన్ను పలుకరించింది.

కృష్ణసుందరి మునపటికంటె బాగా ఒళ్ళుచేసింది. నాజూకు తగ్గి మనిషిలో నిండుదనం కనుపిస్తోంది. మనిషి కాస్త నల్లబడింది ! కనుపాపల వెనుక జీవితాన్ని ఆకళింపు చేసుకున్న వెలుగు !!

"సెకెండియర్ పరీక్షలు భీమవరంలో వ్రాసేను," అంటూ నేను అడగకుండానే క్రితం ఏడాది కనుపించనందులకు సంజాయిషీ చెప్పుకుంది.

"అన్నీ అయిపోయాయా ?" అన్నాను.

"యూనివర్సిటీ వాళ్ళు దయతలిచి అన్నీ అయ్యాయనిపించేరు. మీ గురించి అడగనులెండి !" అంది.

"మీ నమ్మకానికి థేంక్స్ !".

"ఈ సారి మీ నెంబరెంత" అడిగింది.

నెంబరు విని సంబరంతో ఎగిరి గంతేసినంత పనిచేసింది. "ఈ సారి మీ ముందు బెంచీమీద నేను ! 'అల్ఫా బెటికల్ ఆర్డరు'లో మన పేర్లు దగ్గరగా వుండటంవలన నేను ఎంతో లాభం పొందేను. ఈ వేళ మీరు వ్రాసిన 'ఎడిషనల్ షీట్లు' నాకు అందించండి. నేను కాపీచేసి ఇచ్చేస్తాను !" అంది. ఆమె ధైర్యానికి నాకు గుండె ఆగినంత పనయింది. కాని, ఇవ్వనని ఎలా చెప్పను ?

ఒకవేళ దొరికితే ఇద్దరం 'డిబార్' అయిపోతాం. అదేమాట పైకి అన్నాను.

"ఏం ఫర్వాలేదు ! పట్టుబడితే మీ తప్పు లేదని నేను చెప్పేస్తాను. ఎలాగయినా ఈ ఏడాదితో బియ్యే అయిపోవాలి. మా బావ 'ఎమ్మే ఫైనల్' రాస్తున్నాడు. చదువు అయిపోగానే ఈ ఏడాదిలోనే మాకు పెళ్ళి చేయాలను కుంటున్నారు. డిగ్రీ పూర్తవకపోతే పెళ్ళి చేసుకోనని మా బావ మరో 'అల్టిమేటమ్' ఇచ్చేడు" అంది.

ఈ పెళ్ళి చదువు వ్యవహారం చూస్తే నాకు నవ్వొచ్చింది.

"సెకెండియర్లో ఎవరు సాయం చేశారు ?" అన్నాను నవ్వుతూ.

"నా వెనకా ముందూ నాలాటివాళ్ళే పడ్డారు. అందుకని స్లిప్పులు రాసేను" అంది ధీమాగా,

నేను మరి మాట్లాడలేకపోయాను.

అంతలో మొదటి గంట అయింది.

లోనికి వెళ్తూ ''బెస్ట్ ఆఫ్ లక్'' అన్నాను.

"ఫర్ టోర్ ఆఫ్ అఫ్" అంటూ నవ్వుతూ సీట్లో కూర్చుంది. మొదటి నాలుగు పరీక్షల్లోనూ అంతా సవ్యంగానే జరిగింది. నేను షీటు అందించేటపుడు చేయి వణికినా ఆమె మాత్రం ధైర్యంగా పక్కనబెట్టుకొని రాసేది.


ఆమె ధైర్యాన్కి జోహారనలేకుండా వుండలేకపోయాను.

ఆయితే, అయిదో రోజున ఈ వ్యవహారంలో ఆమె దొరికిపోయింది. వాచరు మంచివాడు కనుక మా ఇద్దరికీ

'వార్నింగ్'ఇచ్చి వదిలేశాడు. బయటకు వచ్చేక "ఈ వేళతో ఈ పీడ వదిలి పోయింది" అంటూ నిట్టూర్చి "క్షమించండి. నా వలన మీకు మాట వచ్చింది" అంది.

"ఫర్వాలేదు లెండి"అంటూ స్కూటరు స్టార్టుచేశాను. "మా ఇంటికి రమ్మని రెండేళ్ల క్రితం చెప్పేను, మీరు రాలేదు! మీ పెళ్ళికి కార్డు పడేస్తే మేం వస్తాం !" అన్నాను.

"తప్పకుండా రావాలి మీరు! బై!" అంటూ బస్‌స్టాపువైపు కదిలిపోయింది ఆమె.




రెండు నెలల తరువాత—
యూనివర్సిటీలో పరీక్షా ఫలితాలు చూడటానికి వెళ్ళివస్తూంటే రిజిస్ట్రారు ఆఫీసు మెట్లదగ్గర మళ్ళీ కృష్ణసుందరిని కలిసేను.

"ప్యాసయ్యారా ?" అంది నవ్వుతూ.

"సెకెండ్‌క్లాసు వచ్చింది" అన్నాను.

"కంగ్రాట్స్ ! నా నెంబరు చూసేరా !"

చూడనందుకు నొచ్చుకుంటూ"సారీ! చూడలేదు !" అన్నాను.

"నేను వెళ్ళి చూసుకు వస్తాను, వుండండి !" అంటూ వెళ్ళి అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చింది ఆనందంగా. "పాసయ్యాను" అంది.

"కంగ్రాచ్యులేషన్స్, మొత్తానికి అనుకున్నది సాధించేరు !".

"సాయం అంతా మీదే" అంటూ చుట్టూ చూసి "స్కూటరుమీద రాలేదా ?" అంది.

"లేదు స్కూటరు 'రిపేరులో' వుంది. పదండి, బస్‌స్టాపుకు నేనూ వస్తాను. మిమ్మల్ని బస్‌ఎక్కించి నేను పిఠాపురంకాలనీ వెళ్తాను. అక్కడో స్నేహితుణ్ణి కలియాలి !"

ఇద్దరం నడక సాగించేం.

నా ఉద్యోగం గురించీ, పిల్లల గురించీ ఎన్నో ప్రశ్నలు వేసింది కృష్ణసుందరి.

తరువాత ''మీ ఆవిణ్ణి చూడటమే పడలేదు ఇంతవరకూ !'' అంది.

"మీరు మా ఇంటికి రాకూడదు అనుకుంటే మరి మా ఆవిణ్ణి చూడటం ఎలా కుదురుతుంది ?" అన్నాను నిష్ఠూరంగా.

"అబ్బే ! అదేంలేదు. ఇంట్లో నాకు తీరికుండదు !" అంది. ఆమె మాట్లాడే తీరులో మునపటి హుషారు తగ్గినట్లు అనిపించింది.

"ప్రశ్నలన్నీ నన్నే అడుగుతున్నారు, మీ పెళ్లిసంగతి చెప్పలేదు!" అన్నాను. విరక్తిగా నవ్వేసింది కృష్ణసుందరి.

అంతలో బస్‌స్టాపు చేరుకున్నాం.

రెండు నిమిషాల తరువాత మెల్లగా అంది, "నేను ప్రస్తుతం పెళ్ళిచేసుకోబోటంలేదు".

కారణం ఏమయివుంటుందా ? అని ఆలోచనలోపడ్డాను. కొంతసేపు పోయాక "మీ బావగారు ఒప్పుకోలేదా?" అని అడిగేను.

"కాదు, నేనే ఒప్పుకోలేదు !" అంది.

అంతలో బస్‌వచ్చింది.

బస్సు ఎక్కే హడావుడిలో ఆమె ముందుకు కదిలింది.

"ఎందుకని ?" అడిగేను.

ఆమెను ఎక్కించుకొని బస్సు కదుల్తోంది.

కదిలిపోతున్న బస్సు కిటికీలోంచి తల బయటకు పెట్టి అంది.

"మా బావది ఎమ్మే ఫైనల్‌పోయింది. డిగ్రీ చదివిన పెళ్ళానికి కనీసం ఎమ్మే ఫస్టుక్లాసు మొగుడు లేకపోతే ఎలా ?" అంది. బస్సు వెళ్ళినవంకే చూస్తూ నిలబడిపోయాను.